ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023

5



శ్రీకాకుళం

విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : విదేశీ విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌సి సంక్షేమ, సాధికారిత అధికారి ఆర్.గడ్డెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో టాప్ 200 లోపు విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల్లో పిజి, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సుల్లో విద్యనభ్యసించాలనుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇబిసి, కాపు విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. 35 ఏళ్ల లోపు వయసు గల వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ, పిజి, ఇంటర్‌లో 60 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్‌ను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఎంబిబిఎస్‌లో చేరే విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులు వచ్చే నెల పదో తేదీ లోగా http://jnanabhumi.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీడా లేదు... నీరూ లేదు

- మండుటెండలోనే కూలీల పనులు
- 'ఉపాధి' పని ప్రదేశాల్లో కానరాని సౌకర్యాలు
- సదుపాయాలకు బిజెపి ప్రభుత్వం కోత

ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు భగ్గుమంటున్నాడు. పది గంటల నుంచి బయటకు వెళ్లాలంటే అడుగు పడని పరిస్థితి. అటువంటి మండుటెండలోనూ ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారు. ఎండ నుంచి కాసేపు సేద తీరేందుకు పని ప్రదేశాల్లో నీడ కరువవుతోంది. దాహం వేసి మంచినీళ్లు తాగుదామంటే అవీ లేని పరిస్థితి. మండే ఎండకు వెంట తెచ్చుకున్న మంచినీళ్లు కాసేపట్లోనే గొంతులోకి వెళ్లిపోతున్నాయి. తర్వాత గుక్కెడు నీటి కోసం తడారిన గొంతులతో దిక్కులు చూడాల్సిన పరిస్థితి. ఇదీ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాల దుస్థితి.

ప్రజాశక్తి - పలాస, జి.సిగడాం

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. పొడిబారిన భూమిలో గునపం దిగక శ్రమనంతా కూడబెట్టి శ్రమిస్తున్న దయనీయ పరిస్థితి ఉపాధి కూలీలది. పని ప్రదేశాల్లో కూలీలకు గతంలో నీడ కల్పించేందుకు టార్పాలిన్లు ఏర్పాటు చేసేవారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కూలీలు వాటి కిందకు వెళ్లి సేద తీరేవారు. మంచినీళ్లు, మజ్జిగ వంటివి అందించేవారు. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్ని నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు ఎక్కడా అటువంటి పరిస్థితుల్లేవు. దీంతో మండుటెండల్లోనే చెమట చిందిస్తూ ఒంట్లోని సత్తువనంతా కూడదీసుకొని పనిచేస్తున్నారు. చెమట తుడుచుకునే బట్టలే తలపై వేసుకుని సేదతీరుతున్నారు.

జిల్లాలో 4.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా, వాటిలో 3.78 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 7.49 లక్షల మంది కూలీలకు గానూ ఏడాదిలో 6.08 లక్షల మంది చురుగ్గా పనులకు వస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులకు 2.50 లక్షల మందికి పైగా హాజరవుతున్నారు. పని చేపడుతున్న ప్రాంతాల్లో ఎక్కడా టార్పాలిన్లు కనిపించడం లేదు. నీడ నిచ్చేందుకు టార్పాలిన్లు, వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సదుపాయాలు లేకపోవడంతో కూలీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చెమటలు కక్కుతున్నారు. ఎండలు మండుతుండడంతో ఉపాధి పనుల వేళల్లో మార్పులు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి పది వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 6.30 వరకు పని చేయిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదు. దీంతో నీడ కోసం కూలీలే సొంతంగా పందిళ్లు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. మండుటెండలోనూ రెండు పూటలా పని చేయిస్తున్నారు.



జి.సిగడాంలో మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సదుపాయాలకు కేంద్రం కోత

ఉపాధి హామీ కూలీలకు గతంలో కల్పించే సదుపాయాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోత పెట్టింది. ఉపాధి పనిచేసే కూలీలకు వేసవిలో మూడేళ్ల కిందట వరకు కొన్ని భత్యాలు అందేవి. సాధారణ రోజుల్లో 100 శాతం పనిచేస్తే ఇచ్చే మొత్తాన్నే. వేసవిలో 80 శాతం చేస్తే ఇచ్చేవారు. దీంతో 80 శాతం పనిచేసినా 100 శాతం కూలి వచ్చేది. టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు, ఇతర సామగ్రి అందించేవారు. మజ్జిగ కోసం ఒక్కో కూలీకి రూ.5, అయిదు లీటర్ల మంచినీళ్లకు రూ.5, గునపాల పదునుకు రూ.10 ఇచ్చేవారు. ఇప్పుడవేవీ లేవు. కూలీలు అందరినీ ఒకేలా పరిగణించి కొలతలు ఇవ్వడంతో వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవి భృతిని రెండేళ్లుగా ఆపేశారు. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అప్పటివరకు అందుతున్న సౌకర్యాలన్నీ ఆగిపోయాయి. వీటిలో వేసవి భత్యం ప్రధానమైంది. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఇప్పటికైనా పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, మజ్జిగ సౌకర్యాలు కల్పించడంతోపాటు వేసవి భృతిని అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు.

సౌకర్యాలు లేవు



ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఎంత ఎండ అయినా పనిచేయక తప్పడం లేదు. కాసేపు సేద తీరుదామన్న నీడ లేదు. మంచినీరు కూడా మేము తీసుకెళ్లినవే. ఈ ఎండకు వెంటనే అయిపోతున్నాయి. గతంలోలా టెంట్లు ఏర్పాటు చేయాలి. మంచినీరు, మజ్జిగ అందించాలి.

- కె.లక్ష్మి, సున్నాడ, పలాస

మండుటెండలో కష్టంగా ఉంది



ఎండ వేడిని తట్టుకొని పనులు చేయడం కష్టంగా ఉంది. టెంటు లేకపోవడంతో కొబ్బరి, తాటికొమ్మలతో పందిళ్లు వేసుకుని సేద తీరుతున్నాం. ఉపాధి పనులకు సంబంధించి పనిముట్లు కూడా పంపిణీ చేయడం లేదు. గతంలో వేసవి భత్యం అందించేవారు. ఇప్పుడు దాన్నీ నిలిపివేశారు.

- ఎ.దుర్యోధన, సున్నాడ, పలాస



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

హెచ్ఐవి కేసులు తగ్గుముఖం

- బలమైన సమాజం కోసం సంఘీభావం ప్రకటిద్దాం
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో గతంలో కంటే హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పట్టాయని, అయినా ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులపై వివక్ష పనికిరాదని, సమాజంలో వారూ భాగస్వాములేనని చెప్పారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, రెడ్‌క్రాస్ సంస్థ, బెజ్జిపురం యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన వైద్యారోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో కొవ్వొత్తుల ర్యాలీని జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి గుర్తుగా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బలమైన సమాజం కోసం సంఘీభావం ప్రకటిద్దాం అన్నది ఈ ఏడాది నినాదమని చెప్పారు. ఎయిడ్స్ రోగులు కూడా మనలో భాగస్వాములేనని, వారి పట్ల వివక్ష చూపరాదన్నారు.

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి ఎన్.అనురాధ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది వేల హెచ్ఐవి కేసులు ఉన్నాయని, ప్రతి నెలా 15 వరకు కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ఎయిడ్స్ నిర్ధారణ కోసం ఉచిత పరీక్షలు, మందులు ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులకు అవసరమైన బలవర్ధక ఆహారం, రూ.15వేల ఖరీదు గల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ర్యాలీలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, బెజ్జిపురం యూత్ క్లబ్ సంచాలకులు ఎం.ప్రసాదరావు, ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్ అప్పలనాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా నెట్‌వర్క్ ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

విద్య కాషాయీకరణకు కుట్ర

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

ప్రజాశక్తి - పలాస

కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్య కాషాయీకరణ చేస్తోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు విమర్శించారు. చిన్న వయసులోనే విద్యార్థుల మెదళ్లలోకి మతతత్వాన్ని నూరిపోసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కాశీబుగ్గలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానంలో భాగంగా మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గ విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారుగా 2,650 పాఠశాలలను విలీనం చేశారని, ఉపాధ్యాయుల పోస్టులను కుదించడంతో పాటు డ్రాపౌట్లు పెరిగాయన్నారు. నూతన విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తానని చెప్పి, కేంద్ర ప్రభుత్వ విధానాలను తూచా తప్పక పాటిస్తోందన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసి సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌డి, ఎంఫిల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్ విద్యార్థులకు అందించడం లేదన్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టల్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నాయని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజులకు తోడు పుస్తకాలు, యూనిఫారాలు అమ్మకాలు సాగిస్తున్నాయన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అపార్ట్‌మెంట్లలో కళాశాలలు, పాఠశాలలు నిర్వహిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు ముడుపులకు కక్కుర్తి పడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఒక అనుమతితో మూడు నాలుగు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని, ఈ విద్యా సంవత్సరం నుంచైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే ఎఐఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, నాయకులు సూర్య, పవన్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనంలో పాత బిల్లులకే చెల్లింపులు

- కొత్త చెల్లింపులకు బడ్జెట్ కొరత
- చెల్లించని మూల్యాంకన డిఎ బకాయిలు
- ఉపాధ్యాయులకు తప్పని ఎదురుచూపులు
- ఫలితాలు విడుదలైనా చేతికి రాని పైసలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షల మూల్యాంకనం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో రెమ్యునరేషన్ చెల్లింపులు చేయలేదు. పాత బిల్లుల ప్రాప్తికి పరిమితం చేసి, అరకొర చెల్లింపులు పూర్తి చేశారు. మూల్యాంకనం ముగిసిన తర్వాత ఫలితాలను సైతం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. కానీ పూర్తిస్థాయిలో చెల్లింపులు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

ఇతర జిల్లాల నుంచి పదో తరగతి సమాధాన పత్రాలు సుమారు 2.16 లక్షలు శ్రీకాకుళం జిల్లాకు వచ్చాయి. చీఫ్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర సహాయకులు మొత్తం 1,245 మంది ఉపాధ్యాయులు మూల్యాంకన విధులు నిర్వహించారు. మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులు రోజుకు సగటున 40 సమాధాన పత్రాలు దిద్దారు. ఒక్కో సమాధాన పత్రానికి రూ.10 చొప్పున చెల్లిస్తామని పరీక్షల సమయంలో ప్రభుత్వం జిఒను విడుదల చేసింది. ఈ జిఒ మేరకు మూల్యాంకన మొత్తాన్ని చెల్లించాల్సి ఉన్నా, ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఒక్కో సమాధాన పత్రానికి రూ.6.60 మాత్రమే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేశారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదలైతే తప్ప మిగిలిన రూ.3.40 చెల్లించలేమని పరీక్షల నిర్వహణ విభాగం అధికారులు చెప్తున్నారు. దీంతోపాటు డిఎ, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి టిఎ కూడా ఇవ్వాలి. ఏప్రిల్ 19 నుంచి 26 వరకు మూల్యాంకన ప్రక్రియ నిర్వహించారు. గణితం, ఆంగ్లం, సంస్కృతం మినహా ఇతర సమాధాన పత్రాల మూల్యాంకనం గత నెల 25వ తేదీనే ముగిసింది. మూల్యాంకనం పూర్తయిన మరుసటి రోజే రెమ్యునరేషన్ చెల్లిస్తామన్నారు. మే మొదటి వారంలో రూ.6.60 పాత జిఒ మేరకు చెల్లించి మిగిలిన మొత్తాలకు చేతులెత్తేశారు.



రెండు విధాలుగా స్వీకరణ

సమాధాన పత్రాల మూల్యాంకన రెమ్యునరేషన్ రేట్లు మారాయి. గతేడాది వరకు ఒక్కో సమాధాన పత్రానికి రూ.6.60 చెల్లించేవారు. మూల్యాంకన ధరలు పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నుంచి ఒక్కో సమాధాన పత్రానికి రూ.10 చెల్లిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మూల్యాంకన కేంద్రంలో రెమ్యునరేషన్‌కు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి పాత, కొత్త బిల్లులు స్వీ కరించారు. పాత ధర మేరకు రూ.6.60 చొప్పున ఒక బిల్లు, దానికి అనుబంధంగా రూ.3.40 చొప్పున మరో బిల్లు తీసుకున్నారు. ఒక్కో ఉపాధ్యాయునికి రూ.ఆరు వేల నుంచి రూ.ఏడు వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ మొత్తం మీద సుమారు రూ.ఐదు లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది.

చెల్లించడానికి చర్యలు

మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులతో బిల్లులు స్వీకరించాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా మొదట విడత బిల్లులు ప్రాప్తికి చెల్లింపులు పూర్తి చేశాం. డిఎ, కొత్త జిఒ ప్రాప్తికి చెల్లించాల్సిన మిగిలిన మొత్తాలను ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత చెల్లించేందుకు వీలుంది.

- ఆలీఖాన్ , పరీక్షల విభాగం సహాయ కమిషనర్



మాట్లాడుతున్న సింహాచలం

పట్టణాల్లోనూ 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఇటీవల విలీనం చేసిన గ్రామ పంచాయతీల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిల్లిపాలెంలో కూలీలతో ఆదివారం వారు మాట్లాడారు. చాపురం, పాత్రునివలస, పెద్దపాడు, ఖాజీపేట, కిల్లిపాలెం, తోటపాలెం, కుశాలపురం గ్రామ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేశారని, ఆ పంచాయతీల్లో ఉపాధి హామీని నిలుపుదల చేయడం వల్ల వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణతో కూలీలకు పూర్తిస్థాయిలో పని లభించడం లేదని చెప్పారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థిక భరోసా లభించేలా పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ రక్షణకు ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.లక్ష్మి, రాజేశ్వరి, ప్రభావతి, అప్పనమ్మ, కుమారి, పార్వతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ పరిశుభ్రతకు ప్రాధాన్యం

నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు

ప్రజాశక్తి - గార

కళింగపట్నం సాగర తీరంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లాలో పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, స్థానిక ప్రజలు, విద్యార్థుల సహకారంతో బీచ్ క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. వాతావరణ కాలుష్య రహిత వస్తువులను వినియోగించాలన్నారు. వ్యర్థాలు మట్టిలో కలిసిపోయే విధంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నాయక్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, తహశీల్దార్ రామారావు, సర్పంచ్ లలితా ఎర్రన్న, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి, ఎన్‌ఎసిఎల్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను సేకరిస్తున్న స్వచ్ఛ సేవకులు

లైసెన్సులకు ఎలక్ట్రానిక్ పత్రాలు అనుమతి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా లైసెన్స్ స్మార్ట్‌కార్డుల కొరత కారణంగా వాహనదారులు రవాణాశాఖ వెబ్‌సైట్ నుంచి పొందిన ఆర్‌సి, లైసెన్స్ పత్రాల కాపీలను అందుబాటులో ఉంచుకోవాలని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రవాణాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫారం-6, 23ను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగా కార్డుల జారీ మొదలయ్యేంత వరకు https://aprtacitizen.epragathi.orgలో ఫారం-6, ఫారం-23 అధీకృత పత్రంగా పొందుపరిచినట్లు స్పష్టం చేశారు. అధికారుల తనిఖీల్లో వాటిని చూపిస్తే సరిపోతుందని తెలిపారు. 2021 డిసెంబరు 26వ తేదీ వరకు లైసెన్స్‌లు చేయించుకున్న వారిని స్మార్ట్ కార్డులు సరఫరా చేశామని పేర్కొన్నారు. ఆ తర్వాత కార్డుల కొరత కారణంగా ఇవ్వలేదని తెలిపారు. కార్డులు వచ్చాక వ్యక్తిగతంగా ఆయా చిరునామాలకు పంపిస్తామని పేర్కొన్నారు.

వేసవి శిబిరాలపై పెరిగిన ఆసక్తి

- యువతకు క్రీడల్లో ప్రోత్సాహం
- క్రీడా సాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి క్రీడా శిబిరాలపై చిన్నారుల్లో ఆసక్తి పెరుగుతోందని క్రీడా సాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.శ్రీధర్ తెలిపారు. జిల్లాలో వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, త్రోబాల్ వంటి క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు సత్తా చాటుతున్నారని చెప్పారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో నిధులు వస్తే క్రీడాకారులు మరింత రాణించగలిగే అవకాశముంటుందని తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

జిల్లాలో క్రీడా వికాస కేంద్రాల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో ఆమదాలవలస, టెక్కలి, పాతపట్నం, రణస్థలం (ఇండోర్ స్టేడియం)లో క్రీడా వికాస కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇచ్ఛాపురం, పలాస, నరసన్నపేట మండలాల్లో స్టేడియంల నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. గార మండలం కళింగపట్నంలో గతంలో స్టేడియం నిర్మాణానికి అనుమతులు వచ్చినా తర్వాత నిర్మాణ పనులు ప్రారంభం కాక నిలిచిపోయాయి. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ ఏడాది పొడవునా అందుబాటులో ఉంది. శాంతినగర్ కాలనీలో ఐదు కోర్టులతో బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఇండోర్ స్టేడియం అందుబాటులో ఉంది.

జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం ఏ దశలో ఉంది? ఎప్పటికి పూర్తవుతుంది?

ప్రస్తుతం కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు నిలిచి ఉన్నాయి. భవన నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత గ్యాలరీ నిర్మాణం జరుగుతుంది. పనుల్లో కొంత ఆలస్యమైనా మంత్రి చొరవతో ఇప్పుడు పనుల్లో వేగం పెరిగింది.



ఏఏ క్రీడాంశాల్లో కోచ్‌ల కొరత ఉంది? వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారు?

ఐదేళ్ల కిందట ఒక్క కోచ్‌తోనే అన్ని క్రీడాంశాలను నడిపించేవారు. ప్రస్తుతం అన్ని క్రీడాంశాల్లో కోచ్‌లను నియమించేందుకు ప్రయత్నాలు చేశాం. ప్రస్తుతం ఫుట్‌బాల్, ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్‌కు కోచ్‌లు లేరు. వీటిని భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తోడ్పాటుతో ముందుకెళుతున్నాం.

వైఎస్ఆర్ క్రీడా ప్రోత్సాహకాలకు ఎంతమంది ఎంపికయ్యారు? ఏఏ అంశాల్లో జిల్లాకు వచ్చాయి?

2019-20 నుంచి ఏటా వైఎస్ఆర్ క్రీడా ప్రోత్సాహకాలకు జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికవుతున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుతున్నాయి. టెన్నికాయిట్‌లో నలుగురు, బాల్ బాడ్మింటన్‌లో ఐదుగురు, అథ్లెటిక్స్‌లో ఒకరికి, సాఫ్ట్‌బాల్‌లో 13 మంది, వాలీబాల్‌లో ఇద్దరికి, పవర్‌లిఫ్టింగ్‌లో ఒకరు క్రీడా ప్రోత్సాహకాలు పొందిన వారిలో ఉన్నారు.

జిల్లాలో క్రీడాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలు ఏమిటి?

జిల్లాలో దేశ మొత్తం చర్చించుకునేలా ఒక గొప్ప క్రీడా ఈవెంట్‌ను నిర్వహించాలని ఉంది. ఈ ఏడాది ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. పాత్రునివలసలో క్రీడల నిర్వహణ కోసం సేకరించిన 33 ఎకరాల మైదానంతో పాటు కోడి రామ్మూర్తి స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. స్టేడియం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ రానుంది.


నియామక పత్రం అందుకుంటున్న జానకిరామ్

గ్రామ, వార్డు సచివాలయ సంఘ జిల్లా అధ్యక్షులుగా జానకిరామ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయ సంఘం జిల్లా అధ్యక్షునిగా దవళ జానకిరామ్ నియామకాన్ని ఆమోదించినట్లు గ్రామ వార్డు సచివాలయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనుబంధంగా గ్రామ, వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 26 కొత్త జిల్లాలకు 21 జిల్లాల కమిటీలను రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ సమక్షంలో నియమించి ఆమోదించామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా దవళ జానకిరామ్, జిల్లా కార్యదర్శిగా బుక్క గణపతిరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా దాసరి దుర్గాప్రసాద్, 21 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ఆమోదించి నియమించినట్లు తెలిపారు. జానకిరామ్ మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తానని తెలిపారు.

అప్పారావు మృతిపై సంతాపం

శ్రీకాకుళం అర్బన్ : విద్యావేత్త, జెఎన్‌టియు, కాకినాడ విశ్రాంత వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్లం అప్పారావు మృతిపై ఎపిజెఎఫ్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి సాంకేతిక లోకానికి తీరని లోటని సంఘం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు అన్నారు. జాతీయ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో తన ఉపన్యాసాల ద్వారా దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసి అంతర్జాతీయంగా అనేక ప్రశంశలు అందుకున్న గొప్ప వ్యక్తిగా కీర్తించబడ్డారని వారు పేర్కొన్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారన్నారు.


ట్రోఫీని అందజేస్తున్న తేజేశ్వరరావు

క్రికెట్ టోర్నీ విజేత రాయల

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని రాయలలో యువకులు కొద్ది రోజులుగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీలో 40 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో కర్లెమ్మ, రాయల జట్లు తలపడడంతో రాయల జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ నాయకులు సిరిపురపు తేజేశ్వరరావు విన్నర్, రన్నర్‌కు ట్రోఫీలను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగవంశం జానకి, సరళి సర్పంచ్ పడల నాగభూషణరావు, పి.తిరుపతిరావు, డి.గోవిందరావు, పి.రాజారావు, సిరిపురపు మిత్ర బృందం పాల్గొన్నారు.

హౌసింగ్‌పై వాడివేడి చర్చ

ప్రజాశక్తి- కవిటి


అసంతృప్తి వ్యక్తం చేస్తున్న లక్ష్మణరావు

మండలంలో గృహ నిర్మాణ శాఖ పనితీరు బాగులేదని, బిల్లులు మంజూరు చేయడంలో కానీ, పంచాయతీలకు ఇళ్లు కేటాయించడంలో కానీ పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించడం లేదని మండలంలోని సర్పంచ్‌లు, నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరులో భాగంగా గృహ నిర్మాణ శాఖ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి మాట్లాడుతూ చాలా మంది లబ్ధిదారులు జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లు తుది దశకు చేరుకుంటున్నా ఇంకా వారికి బిల్లులు చెల్లించడం లేదని అన్నారు. దీనిద్వారా పార్టీకి నష్టం వాటిల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన హౌసింగ్ ఎఇ సాయికిరణ్ బిల్లులు చెల్లించడంలో ఎటువంటి జాప్యం లేదని చెబుతుండగా, ఎఎబి చైర్మన్ కల్పించుకుని క్షేత్రస్థాయిలోకి తనతో వస్తే బిల్లులు ఎంతమందికి రాలేదో చూపిస్తానని, అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ కవిటి పంచాయతీకి 217 ఇళ్లు కేటాయిస్తే... అందులో కేవలం 27 ఇళ్లకు మాత్రమే అనుమతులు కేటాయించారని అన్నారు. అసలు గృహ నిర్మాణ శాఖలో ఎం జరుగుతోందని, ఏదైనా అడిగితే డిపిఆర్ అవ్వలేదని అంటారని, అసలు ఆ డిపిఆర్ అంటే ఏమిటో, ఈ అధికారులు ఎం చేస్తున్నారో? తెలియడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు జగనన్న గృహ నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా, సమాచారం ఉన్నా ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేస్తే చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అలా కాకుండా వ్యక్తిగతంగా తీసుకుంటే ఇటువంటి సమస్యలే ఎదురవుతాయని అన్నారు. అనంతరం విద్య, వైద్యం, ఎన్‌ఆర్‌జిఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నర్తు రామారావును ఘనంగా సన్మానించిన సభ్యులు, మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అంతకుముందు ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీ కణితి విశ్వనాథం, జగతి పంచాయతీ మాజీ సర్పంచ్ వెంకటరమణ, ఆంధ్రజ్యోతి విలేకరి దెయ్యం శివాజీకి నివాళ్లర్పించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్.రామారావు, డిసిఎంఎస్ చైర్మన్ ఎస్.సుగుణ, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎఎంసి చైర్మన్ బాబూరావు, వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న కూలీలు

నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్లు మాకొద్దు

మీడియా ముందు కూలీల వెల్లడి

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు నీలాపు ప్రసాద్‌రెడ్డి, బొమ్మాళి రామారావులను తొలగించాలని సీతానగరం గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఇటీవల అనేక అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన టెక్కలి డ్వామా ఎపిడి మురళీకృష్ణ మొక్కుబడిగా విచారణ చేపట్టారని సీతానగరం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి 200 మంది ఉపాధి కూలీలు స్థానిక రచ్చబండ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రారావు మాట్లాడుతూ తాను విదేశాలు ఉన్న సమయంలో నా పేరుపై ఉపాధి పనులు బిల్లులు చేసుకున్నారని, నాకు మాత్రం కూలి అందలేదని తెలిపారు. విచారణ పక్కదారి పట్టించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్ తమతో సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. తార రామారావు తన కుమారులు దుబాయ్‌లో ఉన్నారని, ఆయన పేరున మస్టర్లు వేసి, అతను వచ్చాక ఆయన దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసుకున్నారని తెలిపారు. గతేడాది మొక్కలు నాటే పనులు చేశామని, దాని కూలి కూడా ఇప్పటివరకు అందలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన అప్పారావు అనే యువకుడు నీలాపు ప్రసాద్‌రెడ్డి, రామారావు అక్రమ దందాపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో నాలుగు వారాలు పనిచేయగా, మూడు వారాలకు మాత్రమే కూలి అందాయని తెలిపారు. జాబ్‌కార్డు మంజూరు చేస్తామని 200 నుంచి 400 వరకు వసూలు చేశారని తెలిపారు. గత రెండేళ్ల క్రితం రెవెన్యూ ప్లాంటేషన్ పథకంలో మొక్కలు నాటిన కూలి రాలేదని అన్నారు. కూలీల దగ్గర కూలి జమైన తర్వాత రూ.100 నుంచి రూ.200 తీసుకుంటున్నారని అన్నారు. వాస్తవాలు విచారణలో తెలియజేస్తే వారి ఇంటికి వెళ్లి వ్యక్తిగతంగా దూషిస్తూ... నేను లేకపోతే గ్రామానికి ఉపాధి పనులు ఉండవని ఫీల్డ్ అసిస్టెంట్లు బెదిరించినట్లు గ్రామసులు తెలిపారు. అనేక అక్రమాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లతో మేము పనులు చేయలేమని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న రామకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర కాంట్రాక్టు లెక్చరర్స్ జెఎసి చైర్మన్ జి.రామకృష్ణ కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకే జిఓతో నియమించిన కాంట్రాక్టు అధ్యాపకులు విభజిత తెలంగాణ రాష్ట్రంలో సర్వీసుల క్రమబద్ధీకరణకు నోచుకున్నారని అన్నారు. నగరంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఆదివారం కాంట్రాక్టు అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం సమావేశం నిర్వహించారు. 23 ఏళ్లుగా ప్రభుత్వ కళాశాలల్లో సేవలందిస్తున్నామన్నారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఐక్య వేదిక చైర్మన్ రౌతు గోపి, సంఘం ప్రధాన బాధ్యులు డాక్టర్ డి.లక్ష్మునాయుడు, ఐక్యవేదిక కో-చైర్మన్ ఎస్.కనకారావు, రట్టి శ్యామసుందర్, సంఘం పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.కె.రవిబాబు, సంఘం మీడియా సెల్ ప్రతినిధి దుగ్గిరాల రాంప్రసాద్, పక్కి ముద్దుబాబు, ఎస్.శ్యామలదేవి, కాశీరత్నం పాల్గొన్నారు.

అలనాటి జ్ఞాపకాలు

కవిటి: వారంతా సుమారు 24 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆలింగనాలూ చేసుకున్నారు. ఆడారు.. పాడారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించి తమ భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసిన గురువులను సన్మానించుకున్నారు. అలనాటి తమ చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను తలచుకుని ఆనంద సాగరంలో తేలియాడారు. 1998-99 పదో తరగతి విద్యార్థుల ఈ మధుర జ్ఞాపకానికి రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది.


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

గ్రేడ్-2 విఆర్‌ఒలను రెగ్యులర్ చేయాలి

పోలాకి: జిఒ నంబరు 13 ప్రకారం సిపిటి, సర్వే పరీక్షలో ఉత్తీర్ణులైన గ్రేడ్-2 విఆర్‌ఒలను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని విఆర్‌ఒల సంఘం జిల్లా కార్యదర్శి వై.ప్రవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. పోలాకి కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతేడాది అక్టోబరు 16న సర్వే డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాశామని, ఇటీవల విడుదల చేసిన సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 25 మంది ఉత్తీర్ణులయ్యారని అన్నారు. ఫలితాలు వచ్చి నెల రోజులు దాటుతున్నా ప్రొబెషన్ డిక్లేర్ చేయలేదని, దీంతో ఆర్థికంగా, సర్వీస్‌పరంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెలైనా పూర్తిస్థాయి వేతనం తీసుకునే విధంగా జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు ఆదినారాయణ, రాము, తేజ, ఊమ, రాజేశ్వరి పాల్గొన్నారు.

యువకునికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మెళియాపుట్టి : మండలంలోని పరశురాంపురం పంచాయతీ హీరాపురానికి చెందిన గిరిజన యువకుడు, జనసైనికుడు ఎం.గవరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, నాయకులు ఆదివారం పరామర్శించి రూ.7 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరగా కోలుకోవాలని, భవిష్యత్‌లో జనసేన పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సవర రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్, తరుణగిరి, కె.పాపారావు, రాజు పాల్గొన్నారు.

'అసిరమ్మతల్లి' పాటల ఆడియో ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : మండలంలోని తేలుకుంచి గ్రామ దేవత అసిరమ్మ తల్లి పేరున తయారు చేసిన పాటల ఆడియోను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి ఆరు పాటలు రచించి పాడారు. ఎర్ర ఎర్రని గాజులే వేసుకొని, కోటి కోటి దండాలు అశ్రమామాతల్లి, తేలుకుంచిలో వెలసిన అసిరమ్మ అసిరమ్మ తల్లి, శిరసానమామి అసిరమ్మ అష్టోత్తరం, ఓం శ్రీఅసిరమ్మ మంత్రం పాటలు రాసి పాడారు. ఇందులో బృందం జయలక్ష్మి పట్నాయక్, నీలాపు మనీషా, కొత్త లావణ్య సంగీత వాయిద్యాలు హేమంత్ కుమార్ బాడిత్య, చిన్న మోహన్, నిత్యానంద్ బాడిత్య, సంగీత సహకారం అందించారు. అనంతరం తేలుకుంచి గ్రామ పెద్దలు కళాకారులను సన్మానించారు.

గౌతు శివాజీ పరామర్శ


పరామర్శిస్తున్న గౌతు శివాజీ

మందస : మండలంలోని బాలిగాంలో సీపాన విజయ్ కుమార్, పిడి మందసలో ఆరసవల్లి సంతోష్, సిరిపురంలో కొల్లాన ఢిల్లీశ్వరరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర శివాజీ ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులకు గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు దుర్యోధన, లింగరాజు డొంకూరు తిరుపతి దాసరి తాతారావు ఉన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు


పనులను పరిశీలిస్తున్న అప్పారావు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీ తెనిగిపెంటలో తాగునీటి బోరు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి స్పందించి మరమ్మతులు చేసి తాగునీటిని అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కళింగపట్నం అప్పారావు, పిల్లల హరిబాబు యాదవ్, కర్రి ఢిల్లీరశ్వర్, డొంకనా విరస్వామి, వంకల రామయ్య పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న గురునాథ్ యాదవ్

టెక్కలి రూరల్ : రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదినం సందర్భంగా టెక్కలిలో బ్రాహ్మణ వీధిలో 50 మంది వృద్ధులకు, మహిళలకు యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ యాదవ్ ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజకుమార్‌రెడ్డి, కోనారి మల్లేషు, రెడ్డి శాంతమ్మ, రాపాక కృష్ణ, బొమ్మాళి సురేష్, రాపాక కృష్ణ యాదవ్, కర్రి జగదీష్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి


టెక్కలి : రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న పరమేశ్వరరావు

టెక్కలి : మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ నవభారత నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆశించారని కాంగ్రెస్ అధికార జిల్లా ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కోత మధుసూదనరావు అన్నారు. రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆదివారం పళ్ళ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తున్న భారత్‌ను ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచాలని రాజీవ్ ఆశించారని అన్నారు. రాజీవ్ గాంధీ కమ్యూనికేషన్ శాస్త్ర సాంకేతిక రంగాల్లో నాడు నాటిన మొక్కలు నేడు ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ ముందుకు నడవడం కాంగ్రెస్ పార్టీ స్వభావమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్నూరు ఆనందరావు, రమణ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో భాంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవితేశ్వరరావు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షులు మజ్జి బాబూరావు, సాసుమాన శ్యాసుంద్రరావు చొక్కరి, గాంగేయ, పలాస బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొర్ల హేమారావు చౌదరి, టంగుడు వీర్రాజు, తాంబ మధుసూదనరావు, రమేష్ సాహు పాల్గొన్నారు.

29 నుంచి గ్రామదేవత ఉత్సవాలు

ప్రజాశక్తి- మందస


మాట్లాడుతున్న గణేష్‌రావు

అన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఉత్సవ కమిటీ, మహేంద్ర కళామండలి, స్పందన సాహితీ సంస్కృతి వేదిక ఆధ్వర్యాన ఈ నెల 29 నుంచి అన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మహేంద్ర కళామండలి కార్యదర్శి తెలుకుల గణేష్‌రావు, స్పందన కార్యదర్శి వడ్డీ గోపాలకృష్ణ తెలిపారు. కళింగ వైశ్య సంఘం భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేంద్ర కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు గిన్ని అప్పలస్వామిరెడ్డి జ్ఞాపకార్థం జిల్లాస్థాయి పాటలు పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు అందరూ పాల్గొవాలన్నారు. గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. మరిన్ని వివరాలకు 9440321034, 9000331343, 9703956592, 9032778958 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.


కొత్తూరులో వర్షం

ప్రజాశక్తి- కొత్తూరు

కొత్తూరులో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు పంటకొచ్చే మామిడి కాయలు నేలకొరిగాయి. అవి బద్దలవ్వడంతో అపార నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే పగలంతా ఎండ వేడితో అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. అలాగే ఎచ్చెర్ల, శ్రీకాకళం మండలాల్లో ఈదురు గాలులు వీచాయి.

ఇంటిపై, కొబ్బరి చెట్టుపై పిడుగు

కొత్తూరులోని దేవరవీధిలో ఈదురుగాలులు, వర్షంతో కురిసింది. ఈ సమయంలో పొగిరి రవి ఇంటిపై పిడుగుపడడంతో గోడ పెచ్చులుడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే కుంటిభద్రలో అగతముడి బాలకృష్ణ పెరట్లో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో ఒక్కసారి మంటలు వ్యాపించాయి. అంగూరు తిరుపతిరావు పెట్లో ఉన్న సిరిసిం, వంశధారకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

జనసేన బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న రామ్మోహనరావు

ఆమదాలవలస : జనసేన పార్టీ బలోపేతం చేయాలని నియోజకవర్గ నాయకులు కృషి చేయాలని ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులుగా నియమితులైన కొత్తపేట నాగేంద్ర, యలకల రమణ, పైడి మురళీమోహన్‌లకు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఆయా మండలాల్లో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు పాత్రుని పాపారావు, జన సైనికులు బాల మురళి, ధనుంజయ్, రమణ, అనూష్ కుమార్, అశోక్, రాంబాబు, అప్పలరాజు, సురేష్, బాలకృష్ణ, రాజు, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కాలువ మరమ్మతులు

ప్రజాశక్తి- పలాస


పనులను పరిశీలిస్తున్న గీత

సొంత ఖర్చులతో మురుగు కాలువ పనులు చేపట్టి పరిష్కారం చూపామని కౌన్సిలర్ ఎస్.గీత అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదో వార్డు పొందర వీధిలో మురుగు కాలువ మరమత్తులకు గురై అధ్వానంగా తయారైంది. దీంతో ఆ ప్రాంత మహిళలు వార్డు కౌన్సిలర్ గీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఆమె స్పందించి సొంత ఖర్చులతో రెండు రోజులుగా పనులు చేపట్టి పరిష్కారం చూపామన్నారు. ఇప్పటికే పొందర వీధిలో సొంత ఖర్చులతో రెండు వైపుల కల్వర్టులు ఏర్పాటు చేశామని, తాగునీటి పైపులైన్లు వేశామని తెలిపారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సహాయ సహకారాలతో మున్సిపల్ సాధారణ నిధులతో పవర్ బోరు, పెంట పోలమ్మ ఆలయం పక్కన సిసి కాలువ నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశామని తెలిపారు. వీధి మధ్యలో రహదారి అధ్వాన్నంగా తయారైందని, పరిష్కరించాలని చైర్మన్ గిరిబాబు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ చిత్తరెడ్డి శ్రీనివాస్, పాపారావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సంతబొమ్మాళి : కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందారు. వెంటనే స్థానికులు పలాస రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్ఐ షరీఫ్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ దొరికిన ఆధార మేరకు మృతుడు నరసన్నపేట మండలం తామరపల్లికి చెందిన బి.భరత్‌గా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆదినారాయణ (ఫైల్)

జలుమూరు: మండలంలోని కొమనాపల్లి పంచాయతీ కత్రివానిపేటకు చెందిన గానుగుల ఆదినారాయణ (54) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు మద్యానికి బానిసై పని, పాటు లేకుండా తిరుగుతూ ఉండేవాడు. దీంతో కొడుకు శంకరరావు, భార్య సరస్వతి అతనిని మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 10న గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం పక్కన మందులో పురుగుల మందు కలుపుకుని తాగేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. కుమారుడు శంకరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కేబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట-జర్జంగి జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం ఖుర్ధాకు చెందిన రజిత్ కుమార్ ప్రధాన్‌కు గాయాలయ్యాయి. రజిత్‌కుమార్ ప్రధాన్ బాలసూర్ నుంచి విశాఖపట్నంకు రొయ్యిలు, చేపలు కంటైనర్‌తో తీసుకెళ్తున్నారు. జర్జంగి సమీపంలోకి వెళ్లేసరికి కంటైనర్ టైర్ పేలిపోవడంతో రోడ్డు పక్కన చెట్టుకు, వాటర్ ట్యాంకుకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ క్యాబెన్ నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ అందులో చిక్కుకుపోయాడు. అక్కడ ఉన్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను అతి కష్టంమీద బయటకు తీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అదుపు తప్పిన కారు

తప్పిన ప్రమాదం

పొందూరు: మండలంలోని కింతలి కూడలి వద్ద ఆదివారం పొందూరు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి దుకాణాలపైకి దూసుకెళ్లిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు... కారు అతివేగంగా రావడంతో మలుపు వద్ద అదుపు తప్పి సమీపంలో దుకాణాలపైకి దూసుకెళ్లగా... అక్కడున్న గోడను ఢీకొట్టి అగిపోయింది. దీంతో కింతలి కూడలిలో భయానక వాతావరణం చోటుచేసుకుంది. అయితే నిత్యం మనుషులతో రద్దీగా ఉండే కింతలి కూడలిలో ఏఒక్కరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో నాలుగు బైకులు, రెండు సైకిళ్ల ధ్వంసమయ్యాయి.


బోల్తా పడిన వ్యాన్

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాను

టెక్కలి రూరల్ : మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున లగేజ్ వ్యాన్ అదుపు తప్పి పది అడుగుల లోతులో ఉన్న వరద కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం తెలపడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రునికి చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రూరల్ మండలం బావాజీపేటలో నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారి రాజు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగవద్దని, అధిక మొత్తంలో తాగునీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్ల, పళ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. మలేరియా, డయేరియా వంటి వ్యాధులపై నిర్లక్ష్యంగా ఉండకూడదని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.